చర్య నోటీసు జారీచేసింది. మరి ఆ సిఫారసు చేసినవారి మాటేమిటో?

* * *

అంతా తామే పాముకోవాలన్న ఆరాటం కొద్దీ తాము పట్టుకొని వ్రేలాడుతున్న చెట్టునే వరుసపెట్టి నరుకుతున్నారు. పుర్రెకొక బుద్ధి తలకొక దారి అయితే ఏపనీ ముందుకు పోదు. ఏదీ నిర్వాహకంకాదు. క్రమశిక్షణలేని సంస్థ వ్యవహారం చుక్కానిలేని నావ మాదిరే అవుతుంది. అందులోను తెడ్డువేసేవాళ్లు అడ్డదిడ్డంగా, అవకతవకగా ఉంటే ఇకను చెప్పనే పనిలేదు. చేసుకున్న నేరానికి కాదిపోయ్యాక తప్పదని వీరికి పదవులు కట్టబెట్టినందుకు ప్రతిఫలం ఎలా వస్తుంది?

# ★ క్షణంలో సగం ★

"శారద"

చీకటి ఆవరించిన గదిలోకి ప్రవేశిస్తున్న గాలి ఆలోచనల్ని మోసుకొస్తోంది. కాని ఉక్క పోయ్యటం మానలేదు. అధికార రాజకీయాలతో ఆటలాడ్డానికి కనీసం ఆరు వారాలైనా నిరాహార దీక్షపూనాలని శ్రీ స్వగతం గారు నిర్వచించిన మాట జ్ఞాపకమొచ్చి బల్లమీద తల మోటించి వింటున్నాను బైట కోలాహలాన్ని. ఎడతెరిపిలేని ప్రయాణం చేస్తున్నారు మనుష్యులు. నిర్వచనం ఎరగని మహాచక్రంలో పడి దొర్లుతున్న నీటి ప్రవాహంలాగా; శూన్య ప్రదేశంలో వెలిగే కాంతి కిరణాల అగమ్య ఆదర్శంవలె; ఎందుకూ, ఎక్కడికీ, వీళ్ల ప్రయాణం ఆరాటం? టెలివిజన్‌కన్న గొప్పదీ, రేడియోకన్న ఉత్కృష్టమూ అయిన యంత్ర సాధనతో, వీళ్ల మనఃపరిపాకాన్ని కొలుస్తో పెద్ద జావా చుట్ట వెలిగించాను. చుట్ట పొగ ఉంగరాల్లోంచి, చీకటి ఉక్కల్లోంచి, ఊపిరాడని మానవ ప్రయత్నం వినబడుతున్నది.

కాయితాలమీద అక్షరాల కరకర ధ్వని; రిక్షాగంటలు; పెళ్లి మంత్రాలు; సంసార రాజకీయాల్లో, చీరెల పేచీ; హోటలు పనివాళ్ళ ఆక్రందనం కలిసి గజిబిజిగా, ఈ గదిలోకి ప్రవేశించినై.

రోడ్లవెంట పారిపోదా మనిపించింది. వాతావరణం ఊపిరాడనీయటం లేదు. సంతోషాన్ని సమన్వయించుకోలేక ఏడవబుద్ధయింది. అందమైన కవిత్వంలాంటి అమ్మాయిల్ని సినిమాలు ఆకర్షిస్తున్నాయి.

త్వరలో మానవులు ఒకరినొకరు బాధ లేకుండా తినగలరని చెప్పటానికి ఎవరూ సిగ్గుపడ నక్కరలేదు. ఎన్నడో ఆదిమ దశలో, లక్షల ఏండ్ల క్రిందటినించీ రక్తాన్ని తాగటం అలవాటయిన మనిషి, ఇవ్వాళ్లో రేపో మనిషి రక్తాన్ని జిలేబి పాకంలాగా తాగటం విచిత్రం ఏంగా లేదు.

శాశ్వతమైన పృగ ప్రవర్తన నుండి నన్ను నేను విడిపించుకోవాలని తపనపడుతూ, గది నుండి విముక్తుణ్ణయి, దీపాల వెలుగులో బయల్దేరాను. ఎన్ని కార్లు, ఎంత సందడి. రోడ్లు క్రిక్కిరిసి పోయినాయి. పత్రికలు అచ్చయి, డాక్ ఎడిషనులు విడుదలయ్యే శుభమైన వేళ అది. దర్బార్ రెస్టారెంటులో, మై కాఫీబార్ లో 7యుటీ థియేటర్‌లో రోజంతా రక్తదానం చేసి వచ్చిన ఆత్మలు సుఖం కొనుక్కునే సంధ్యా కాలం అది.

నల్లని సముద్రంమీద సంధ్యారాగం ముదురు నీలం కలిసిన ఎరుపు రంగు కాంతిని పరిచింది. ఆ వెనక ఏమున్నదో అన్వేషిస్తూ, పక్కనే పోతోన్న జాస్మిన్ వాసన పీలుస్తున్నాను. జాస్మిన్ తిరిగి చూసింది. ఖాళీలేని బస్సులలోంచి ఊపిరాడని మనుషుల నిశ్వాసలోంచి బయట పడింది ఈ కన్య. ధగ ధగ మెరుస్తున్న ఖద్దరు

సిల్కు చీర. పాదరసపు బల్బుల వికృత నీల లోహిత కాంతిలో దారుణమైన మృత్యు సందేశాన్ని అందిస్తోంది.

సందేశం సీసాల్లో అమ్మరు. జేబుల్లో పెట్టుకుని అడగనివాళ్ళది పాపంగా సంపాదకులూ' ఉపన్యాసకులూ, సినిమా ప్రొడ్యూసర్లూ, ఆర్థిక వేత్తలూ అందిస్తున్నారు. విందులు పెట్టి ప్రజానీకానికి దయతో, పెద్ద పెద్ద అరటిఆకుల్లో సందేశం వడ్డిస్తున్నారు. జాస్మిన్ మూలుగు కమ్మగావుంది. ఏమిటా సముద్రఘోష? డబ్బు లేక ఇచ్చే రేషన్ కూడా కొనలేక ఏడుస్తున్నది సముద్రం. దానికి సంపాదించే మార్గం బొత్తిగా తెలీదు.

ఈ భావాలు బొత్తిగా విప్లవాత్మకంగా వున్నాయి. జాస్మిన్ బహుశా అండర్ గ్రౌండులో ఉండే కమ్యూనిస్టులా వుంది. ఎవరు...? ఎవరైనా కావచ్చు. అస్థిపంజరం మీద కండలు పెట్టి, దానికి పౌడర్లు పూసి, ఇట్టా రోడ్లమీదికి వొదిలారు ఎవరో పుణ్యాత్ములు.

మనుషుల నవ్వల్లే లేదు ఆమెది. అదృష్ట దేవత ఆవహించిన మరణశయ్య ఆమె.

ఆకర్షణీయమైన ప్రేమకథలో కథానాయకుడు పెట్టే బిగికౌగిలి, వెచ్చని ముద్దులూ భరించలేక పారిపోయి వచ్చిన కావ్యకన్యకలాగా వుంది. లేదా, ఆరవ సినిమాల్లోని, ఎక్స్ట్రా తార అయినా కావొచ్చు.

'ఎక్స్ట్రా కాదు'. అంది జాస్మిన్ జాలిగా.

'ఇక్కడ మాట్లాడితే సంఘం ఆక్షేపించగలదు.'

'హోటల్లోకి పోవటం నాకిష్టం లేదు. అక్కడ కాఫీవాసన చూస్తో తాగకుండా ఉండటం నా తరంకాదు.'

ఇంతకీ ఆమె ఎవరో తేలలేదు.

'ఫ్యాన్ గాలికింద ఆమ్లెట్ ఫలహారం చేస్తూ ఆలోచించాను.

'వృథా...ఇవన్నీ వృథా...'

'నన్నె తెలీదా! నేను దేవతని. గ్రూప్ రాజకీయాధిదేవతని.'

ఎక్కడో చూసిన జ్ఞాపకమే. సెక్రెటేరియట్ వరండాలమీదా, పత్రికల పతాక శీర్షికలమీదా భరతనాట్యం చేసినది ఈవిడే నాకు ఇక్కడ భయంవెయ్యలేదు.

'మీరు దారితప్పారు. పారిస్ కార్నర్ బస్ ఎక్కండి!' అన్నాను గొణుగుడుగా.

ఈప్రదేశం అంతా, సామాన్యులుండేది. దేవతలకేంపని?

దేవత కొరకొరా చూస్తూ వెళ్ళిపోయింది. ఆవిడ రేపణ్ణించి సినిమాల్లో నటించబోతున్నది. కొత్తరకం సినిమాల్ని చూడ్డానికి ప్రేక్షకులకదే తరుణం. ప్రస్తుతం ఆవిడ నటించిన ఒక బ్రహ్మాండమైన తోలుబొమ్మలాట ... మన పూర్వాన్నత్యాన్ని శతథా నిరూపించే కళాఖండం, ఆంధ్రదేశంలోని అన్నికళాకేంద్రాల్లోను విడుదలైంది.

మనకి తలనొప్పి నివారిణ ఆస్ప్రో అవకాశం ఈ శతబ్దాలో లేదని తీర్మానించుకుని శ్రీ స్వగతం కూడా, అధికార రాజకీయాల్లోకి ఆహారదీక్ష పూని ప్రవేశించబోతున్నారు. వారి త్యాగనిరతీ, సేవాదీక్షా పత్రికల్లో పొగిడే కాలం రాకపోదన్న ఆశాభావం ప్రకటించాను నేను.

ఊపిరాడని ఈగది రాజకీయాల్లో నాకు తోడు ఈ బెడ్ రూం లైటు కూడా పాల్గొంటున్నది. బహుశా అది పేపర్లు చదువుతుంది రోజూ. దాంతోపాటు నాశరీరం లేని ఊహాప్రేయసుల్ని కూడా చూస్తుంటుంది రోజూ. దానికి తెలివితక్కువ. బాగా సాగే వ్యాసం సగంలో ఉండగా కప్...కప్...మని ఆరిపోతుంటుంది. అప్పుడు నాకు అనిపిస్తుంది. అది అప్సీనిటీ...అప్సీనిటీ...అంటోందని.

---

వీధి చివర మీటింగులో సంఘసంస్కర్త అరుస్తున్నాడు: "డబ్బుతో ప్రేమని కొనలేం; న్యాయాన్ని కొనలేం; సంఘంలో గౌరవాన్ని కొనలేం; మర్యాదని కొనలేం. కేవలం డబ్బు ఒక్కటే ఏం చెయ్యగలదు!"

గుంపులోంచి ఒక కంఠం: "ఏ డబ్బు సంగతి? చెల్లని నోట్ల సంగతా?"